క్లుప్తంగా

రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్పించాలని 108 సంస్థ ఆన్‌జాబ్ ట్రైనర్ (ఓజేటీ) ఆలుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 108 సంస్థ కార్యాలయంలో గురువారం ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, కాలిన గాయాలకు అందించాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ సాయిషణ్ముఖ్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారి రాజేష్‌వర్మ, తదితరులు

పూసపాటిరేగ: రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చునని పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గురువారం స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఆర్‌వీ రమణ, స్థానిక ప్రజాప్రతినిధిలు జె.శివ, బి.వి జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషిచేయాలని పలువురు వక్తలు సూచించారు. మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ శాఖ సంయుక్తంగా డ్రగ్స్ నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్‌ఆర్‌ఎల్ శాస్త్రి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలపై దృష్టిసారిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు సొంతమవుతాయన్నారు. ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని లావేరురోడ్ నుంచి గాజులువీధి మీదుగా చెరువు గట్టు వరకు రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరడంతో ఈ విషయం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తక్షణమే ఆయన స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశార ని వివరించారు. స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎ స్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనా యు డు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, గవిడి కల్కి, అప్పికొండ ఆదిబాబు, మల్లెంపూడి శ్రీను, ముల్లు పైడిరాజు, గాజులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25న వక్తృత్వ పోటీలు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని గీతామందిరంలో ఈనెల 25వ తేదీన శ్రీమద్భగవద్గీతపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు గీతా సత్సంగ్ సేవాశ్రమ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు ఉంటాయని, ఆసక్తిగల విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పన్ను పేరుతో దందా

- 1వ డివిజన్‌లో అధికార పార్టీ నాయకుల దోపిడి
- వేణుగోపాలపురం ప్రాంతంలో పన్ను పరిధిలోకి రాని 150 గృహాలు
- సంబంధిత యజమానుల నుంచి వసూళ్లకు తెరలేపిన స్థానిక నేతలు



వేణుగోపాలపురం కాలనీ ముఖద్వారం

విజయనగరం: అది విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతం. 2012 సంవత్సరంలో మున్సిపాలిటీలో విలీనమైంది. సుమారు 12 సంవత్సరాలు అయినా ఇప్పటికీ పలు గృహాలు పన్ను పరిధిలోకి రాలేదు. ఈ విషయంలో అధికార యంత్రాంగం సైతం నిర్లక్ష్యం సుస్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇదే అదునుగా భావించిన ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అక్రమ వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీ ఇంటికి పన్ను వేయిస్తాం.. రూ.5వేలు ఇవ్వండి అంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సంబంధిత గృహ యజమానులు పన్ను పరిధిలోకి వస్తే మున్సిపల్ కార్పొరేషన్ పరంగా రావాల్సిన పథకాలు వర్తిస్తాయన్న ఆశతో సదరు మధ్యవర్తుల వలలో పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇటువంటి అనధికారిక దందాలకు అడ్డుకట్ట వేయాలన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ వేణుగోపాలపురం 2012 సంవత్సరంలో మున్సిపాలిటీలో విలీనమైంది. అప్పటివరకు విజయనగరం మండలం పరిధిలో ఉన్న ఈ ప్రాంతం మున్సిపాలిటీలో విలీనం అనంతరం అక్కడున్న గృహాలకు పన్ను విధించాల్సి ఉండగా.. అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఒకప్పుడు చిన్న కాలనీగా ఉండే ప్రాంతంలో అన్ని పొజిషన్ సర్టిఫికేట్‌లతో ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్న వారిలో కొంత మంది వేరే వారికి వాటిని విక్రయించేసుకున్నారు. పొజిషన్ సర్టిఫికేట్ ఒకరి పేరుపై ఉండగా.. ప్రస్తుతం వేరొకరు నివాసం ఉంటుండటంతో నిబంధనల ప్రకారం అధికారులు పన్ను విధించేందుకు సాహసించడం లేదని తెలుస్తోంది. ఇలా 150 వరకు గృహాలకు సంబంధించి కచ్చితమైన ధృవపత్రాలు లేకపోవటంతో పన్ను పరిధిలోకి రాకుండా ఉండిపోయినట్లు సమాచారం. ఇటీవల కాలంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో ఇంటింటి కుళాయిలు మంజూరుకు చర్యలు చేపట్టడంతో పన్ను కట్టని వారికి కుళాయి కనెక్షన్‌లు మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో పన్ను పరిధిలోకి రాని గృహ యజమానుల ఇబ్బందిని ఆసరా తీసుకున్న 1వ డివిజన్‌కు చెందిన అధికార పార్టీ నాయకులు తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, పార్టీ పెద్దలకు చెప్పి పన్ను విధించడంతో పాటు కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేయిస్తామంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

1వ డివిజన్ వేణుగోపాలపురంలో జరుగుతున్న అనధికారిక దందాపై అధికార యంత్రాంగం స్పందించకపోవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి పాత, కొత్త గృహాలకు పన్ను వేయాలంటే సచివాలయ కార్యదర్శులు ఆ బాధ్యతలు నిర్వహించాలి. అయితే సదరు సచివాలయ అడ్మిన్ కార్యదర్శి సెలవుపెట్టి వెళ్లిపోవటంతో ఇన్‌ఛార్జిగా వచ్చిన కార్యదర్శులు ఈ ప్రక్రియపై దృష్టి సారించటం లేదని సమాచారం. దీంతో స్థానిక నాయకులే దళారుల అవతారమెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా.. వేణుగోపాలపురం ప్రాంతంలో పన్ను పరిధిలోకి రాని గృహాలకు పన్ను వేయించేలా చర్యలు తీసుకుంటాం. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సంబంధిత సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో పన్ను వేయిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా పట్టణంతో పాటు మండలంలో వివిధ ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాసన్నపేట రైతు బజార్, దాసన్నపేట, గెడ్డవీధి, గుమ్చి, అయ్యన్నకోనేరుగట్టు, శంకరమఠం రోడ్డు, తురకల చెరువు, గాయిత్రీ ఆస్పత్రి, డిమార్ట్ ఏరియా, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మండల పరిధిలోని చాకలిపేట, కోరాడపేట, గుండాలపేట, కొత్తకాపుపేట, కేవీఆర్ ఎస్టేట్‌కు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

డెంకాడ మండలంలో..

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని డెంకాడ, అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సురేష్‌బాబు తెలిపారు. డెంకాడ పరిధిలోని డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగనాపల్లి, డి.కొల్లం, కె.కొల్లం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరప్పేట, పాతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్ళవలస, దొడ్డిబాడవ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గొలగాం, మాన్యం కల్లాలు, గంట్లం ఎస్సీ కాలనీ, డి.తాళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

తంగుడుబిల్లి పరిధిలో రేపు..

నెల్లిమర్ల రూరల్: మండలంలో తంగుడుబిల్లి 11 కేవీ రూరల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి మరమ్మతుల పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగుడుబిల్లి, అల్తిపాలెం, తమ్మాపురం, సతివాడ గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కామ్రేడ్ సూరిబాబు ఆశయాలను కొనసాగిద్దాం..



కామ్రేడ్ సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్మికులు

విజయనగరం పూల్‌బాగ్: సూరిబాబు పోరాట స్ఫూర్తితో ప్రజా, కార్మిక పోరాటాలు కొనసాగిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. కామ్రేడ్ బుగత సూరిబాబు నాలుగో వర్ధంతి కార్యక్రమాలను స్థానిక డీఎన్‌ఆర్ అమర్ భవన్, పి.డబ్ల్యూ మార్కెట్‌లలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ బుగత సూరిబాబు చిత్రపటానికి నాయకులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. 48 ఏళ్ల పాటు కార్మికుల కష్టనష్టాల్లో అండగా నిలుచున్న సూరిబాబును స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.రంగరాజు, అప్పలరాజు, అప్పరుబోతు జగన్నాథం, పొందూరు రాంబాబు, బూర వాసు, కెల్ల సూర్యనారాయణ, పతివాడ శ్రీను, నంద గణేష్, పలువురు మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

భీమసింగి సుగర్స్ రైతు మహాజన సభ నిర్వహించండి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: భీమసింగి సుగర్స్ రైతు మహాజన సభ నిర్వహించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా జాయింట్ కలెక్టర్, సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సేతుమాధవన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఫ్యాక్టరీ పరిస్థితిపై ఆయనతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి రాష్ట్రంలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ చెరకు ఫ్యాక్టరీని తెరుస్తుందని ఈ ప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు కూడా ఎన్నికల్లో అదే ప్రకటన చేసారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం దీనిపై సరైన నిర్ణయం తీసుకొని రైతులు, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు తాత్రాజు రాజారావు ఉన్నారు.

పన్ను చెల్లింపునకు 'క్యూఆర్ కోడ్'



నూతన విధానం అమలుపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: వ్యాపార, వాణిజ్య రంగాల్లో విస్తరించిన డిజిటల్ లావాదేవీలు క్రమక్రమంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అమలవుతున్నాయి. ఆ దిశగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. ఇప్పటివరకు వివిధ రకాల పన్నులు, చలానాలను కేవలం నగదు రూపంలో స్వీకరిస్తుండగా.. తాజాగా నగదు రహిత డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై క్యూఆర్ కోడ్ ద్వారా ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లతో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకోవచ్చని కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. నూతన విధానం అమలులో సాంకేతిక సమస్యలపై బ్యాంకు, అకౌంట్స్ విభాగ అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ విధానం విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఆన్‌లైన్ పేమెంట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని, నగరవాసులు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

కార్పొరేషన్ కమిషనర్‌గా నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పి.నల్లనయ్య నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నల్లనయ్యను విజయనగరం బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.మల్లయ్యనాయుడును డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

డీఐపీఆర్ఓ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి నూతన కార్యాలయాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రారంభించారు. ఇప్పటివరకు కలెక్టరేట్ మేడపై ఉన్న డీఐపీఆర్ఓ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోని పాత ట్రెజరీ కార్యాలయం వద్దకు మార్పు చేశారు. ఆధునీకరించిన ఈ భవనాలను జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఎస్.సేతు మాధవన్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ మాట్లాడుతూ అన్ని వసతులతో అందరికీ అందుబాటులో సౌకర్యవంతంగా ఉంటుందన్న ఉద్దేశంతో కార్యాలయాన్ని మేడపై నుంచి కిందకు మార్పు చేయడం జరిగిందన్నారు. కార్యాలయ మార్పును జిల్లా అధికారులు, పాత్రికేయులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలనాధికారి దేవ్‌ప్రసాద్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



డెంకాడలో ఈ-పంట నమెదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

డెంకాడ: ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు పొందాలన్నా, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించాలన్నా రైతులు తాము పండించే పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. డెంకాడ పరిధిలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదుకు రైతుల ఆధార్, 1బీని తీసుకుని రైతు సేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సిబ్బందికి అందించాలన్నారు. కౌలు రైతులు కూడా కౌలు గుర్తింపు కార్డును తీసుకుని వెళ్లి పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పూడి నిర్మల, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



5వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

విజయగనరం: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. నగరంలోని 5వ డివిజన్ పరిధి ద్వారకానగర్, బాబామెట్ట, శివపంచాయతీ ఆలయం తదితర ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో కాలువలు సరిగా లేవని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, కళ్యాణ భారతి బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గాదం మురళి తమ డివిజన్‌లో సమస్యలను అధికారులకు వివరించారు. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

డెంకాడ: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని భోగాపురం సీఐ జి.రామకృష్ణ అన్నారు. డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కొత్త క్రిమినల్ చట్టాలు, రహదారి భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను రవాణా చేయడం, కలిగి ఉండటం నేరమన్నారు. ఇలాంటివి చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం, మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమన్నారు. మైనర్లు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటువ్యాధి నివారణే లక్ష్యం



మెరకముడిదాం: కుంచుగుమడాంలో పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ రామ్‌ప్రసాద్‌బాబు, వైద్యాధికారి హైమావతి

మెరకముడిదాం: పశువులను వేధిస్తున్న అంటువ్యాధుల్లో ప్రమాదకర గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తున్నామని మెరకముడిదాం, గర్భాం పశువైద్యశాలల వైద్యాధికారి సీహెచ్.హైమావతి అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథ కంలో భాగంగా మండలంలోని కొర్లాం, కొత్తకర్ర, సిరియాలపేట, కుంచుగుమడాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో 730 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. అలా గే వివిధ రకాల పరీక్షల కోసం 26 పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. శిబిరాలను జిల్లా పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ రామ్‌ప్రసాద్ బాబు తనిఖీ చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

దత్తిరాజేరు: పశుపోషణలో పాడిరైతులు జాగ్రత్తలు పాటించాలని పెదమానాపురం పశువైద్యాధికారి దినేష్ సూచించారు. పెదమానాపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి 200 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.



దత్తిరాజేరు: పెదమానాపురంలో పశువులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

డిగ్రీ ప్రవేశాలకు 24 వరకు ఉచిత రిజిస్ట్రేషన్

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 24 వరకు ఉచితంగా రిజి స్ట్రేషన్ చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు చెప్పారు. డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్ల కోసం అధ్యాప కుల బృందంతో కలిసి అనంతగిరి గ్రామంలో గురువారం ప్రచారం నిర్వహించారు. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులను కలిసి డిగ్రీ చదువుల కోసం తమ కళాశాలలో చేరాలని కోరారు. తమ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, ల్యాబ్, క్రీడామైదానం, లైబ్రరీ, హాస్టల్ వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.ఈరన్న, భాస్కర్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.